రాత్రికి లాడ్జికి చేరాం. అతని ఆహ్వానం మీద అతని రూమ్ లోనే నేను కూడా భోజనం చేసాను చేస్తూండగా నేను ముందుకొంగినప్పుడు మొదటిసారిగా నా మెళ్లో మంగళసూత్రాలు అతని కంట పడ్డాయి

" అదేమిటి?" అడిగాడు టెడ్

" నా వివాహంలో నాభర్త నాకు కట్టే నెక్లెస్. ఒక విధంగా లైసెన్స్ బిళ్ళలు!" నవ్వాన్నేను

" మీకు వివాహమైందా? పిల్లలున్నారా?"

" ఉన్నారు నా కూతురు హైస్కూల్లో చదువుతోంది. నాకొడుకు ఎలిమెంటరీ స్కూల్లో చదువుతున్నాడు నా భర్త ఆంధ్రా యూనివర్సిటీలో రీడరు . మా ఊరు అనకాపల్లి."

" మీకీయన ఎన్నో భర్త?" తెల్లబోయాన్నేను! ఇండియాలోనైనా సరే ఒకాదది రెండోసారో మూడోసారో పెళ్ళి చేసుకోవడం తప్పని నేననుకోను కాని నాకోరిక ఇతని కెట్లా తెలిసిందన్నదే నాకాశ్చర్యం!

" మొదటి భర్తే" .. " యా యా జ్ఞాపకమొచ్చింది హిందూ స్త్రీ ఒక్క సారేగా పెళ్ళి చేసుకునేది! సారీ! " ... " మీకు పెళ్ళయిందా? " .. " లేదు " మా భోజనం పూర్తయింది. టెడ్ లేచెళ్ళి తన బ్యాగ్‌లోంచి స్కాచ్ బాటిల్ తీసుకొచ్చాడు బాయ్‌ని పిలిచి ఐస్ తెప్పించాడు. నావైపు సందేహిస్తూ చూస్తూ కూర్చున్నాడు. నాకర్థమైంది. " ఫర్వాలేదు తీసుకోండి" అన్నాను... " మీరుండగా.. క్షమించాలి" .. " ఎందుకు? అథిధుల కివ్వకుండానే తీసుకుంటారా అమెరికన్లు?"

అతను ఆశ్చర్యంగా చూసాడు " మీరు తాగుతారా? హిందూ స్త్రీలు తాగరని విన్నానే ! "

పొద్దుట్నించీ చూస్తున్నాను అతను ఎత్తి పొడుస్తున్నాడో నిజంగా గౌరవిస్తున్నాడో తెలీట్లేదు తెగించాను " బాష్ ! ఇందులో ఏముందని! ఇవ్వండి మీ కభ్యంతరం లేకపోతే "

అతను మా ఇద్దరికీ గ్లాసులు నింపాడు. ఒహ్ ఒరిజినల్ స్కాచ్ రుచే రుచి! అర గంట తర్వాత అతనికి గుడ్ నైట్ చెప్పి నా రూంలో కొచ్చేస్తూ వెనక్కి చూసాను టెడ్ నిద్ర మాత్రలు మింగుతున్నాడు.

నైట్ గౌనేసుకుని నా బాల్కనీ పిట్ట గోడనానుకుని నుంచున్నాను ఆకాశంలో బారెడెత్తున లేచిన చంద్రుడి ప్రతిబింబం సముద్రంలో పడి సహస్రశకలాలై కరిగించిన వెండి మిలమిలా కదుల్తున్నట్టుంది. వెండంటే జ్ఞాపకమొచ్చింది. మా నాయనమ్మ చచ్చిపోతూ అక్కకీ నాకూ చెల్లికీ పంచిచ్చిన వెండి బంగారం దాన్లో నా వాటాల్ని అమ్మేసి ఇంట్లో నా దక్షిణం వైపు స్థలంలో మేడ కడుతున్నాను గైడ్‌గా పని చేస్తే రోజు కొచ్చే వెయ్యిలో మూడో వంతు మిగిల్తే గొప్ప! మూడు కంపెనీలకూ కలిపి నెలకి పది రోజులకన్నా ఎక్కువ బుకింగుండదు. ఈ మిగిలే డబ్బులోంచే జాలి తలిచి చెల్లి పెళ్ళికి దాస్తున్నాను. నా కారుకి నా ఖర్చులకి అన్నింటికీ ఈ డబ్బే నా పిల్లల ఖర్చు వాళ్ళనాన్నే భరిస్తున్నాడు. అప్పుడప్పుడు ఏ రష్యనో, అమెరికనో నామీద మోజు పడితే వచ్చిందాన్ని జాగ్రత్తగా కూడబెట్టబట్టే కారు కొనుక్కో గలిగాను ఇప్పుడింకో పాతిక వేలుంటేనే గాని మేడ పై భాగం లేవదు. డబ్బు లేదు. ఎట్లా. ఓ, హెల్... టులివ్ ఇన్ ఇండియా!

అదే అమెరికాలో అయితేనా ఛస్తే దరిద్రం ఉండదు! అక్కడ రోజుకు పది డాలర్లుట జీతం! కారు తప్పనిసరిట! టూత్ బ్రష్ కూడా కరెంటుతోనే పని చేస్తుందిట! ఇహపోతే, భోగాలంటావా! లాస్ ఏంజిలిస్‌లో హాలీవుడ్ కలల ఫాక్టరీ, ఫీనిక్స్ కుక్కల పందాలు, క్లీవ్ లాండ్ నయాగరా జలపాతం, శాన్‌డీగో జూ, కళ్లు మిరుమిట్లు గొలిపే వజ్రాల నగల్ని ధరించి తమ ప్రియుల నోట్లో ఉన్న సిగరెట్లకు లైటర్స్ అంటిస్తూ టేబిల్ మీద తిరిగే జూదపు చక్రం మీద పందాలు కాయించే మదవతులూ మదవంతులూ ఉండే లాస్ వేగాస్ కాసినోలు, అన్నింటికన్నా ముఖ్యం రకరకాల డ్రింక్స్ ప్రవహించే షికాగో పానశాలలు, అక్కడి నైట్ క్లబ్స్, అక్కడి మగ న్యూడ్స్ వాళ్ళ అంగాంగ ప్రదర్శనలు, స్టేజీ మీదనే ఆ కాస్త కార్యక్రమం

కూడా కానిచ్చేయ్యటం. అప్పో చాల్బాలు వీటితో జన్మ ధన్యం భూతల స్వర్గానికి మారు పేరు అమెరికా! మై డ్రీమ్ ల్యాండ్!

అన్నట్టు, టెడ్ తనకు పెళ్ళి కాలేదన్నాడు నన్ను చేసుకుని తీసికెడతాడేమో! హాయిగా అక్కడే ఉండిపోవచ్చు! .. విడాకులా! ఆ తంటసం రీడరూ నేనూ ఇప్పుడు కలిసుండి చచ్చాం కనకనా, కొత్తగా విడిపోవటానికి!... నా సంపాదన నేను సంపాదించుకుంటూ హాయిగా ఎంజాయ్ చేసేస్తున్నాను లైఫ్‌ని . కెనెడియన్ క్లబ్ కిక్ ఇస్తోంది స్లోగా. కళ్ళు మూతలు పడుతున్నాయి ఒళ్ళు తేలిపోతుంది. నా దురదృష్టాన్ని తిట్టుకుంటూ పోయి పడుకున్నాను

పొద్దున్నే స్నానం చేసి టెడ్ రూము కెళ్ళాను తలుపు సందులోంచి చూసాను అతను డబ్బు లెక్కపెట్టుకుంటున్నాడు. పదివేల రూపాయల ట్రావెలర్స్ చెక్కులూ, మూడొందల డాలర్ నోట్లూ! తెలిసిపోయింది. టెడ్ సహజంగా డబ్బున్న వాడు పైగా ఫోర్డు కంపెనీ ఇంజనీరు. మాటలా!

మగాడిలో ఆడది వెతుక్కునేది అందమనుకొని ఫోజులు పెడతారు పోరంబోకు వెదవలు! ఎంత డబ్బుంటే అడదాని కళ్ళకి అంత అందంగా మగాడు కనిపిస్తాడని తెలియదు చవటలకి... క్షణక్షణానికీ టెడ్ మీద నాకు మోజు పెరిగిపోతోంది.

టెడ్ బయటకొచ్చి నన్ను చూసి " ఇవాళ కోణార్కకి వెళ్ళి రాత్రికి ఇక్కడికే వెనక్కొచ్చేద్దాం" అన్నాడు.

నేను " అట్లాగే" అన్నాను. . టాక్సీలో అతన్ని రాసుకోవాలని అప్పుడప్పుడు ప్రయత్నించాను. కాని అతడు పడనియ్యలేదు. ఏడింటికి కోణార్క సూర్య దేవాలయం దగ్గరున్నాం. మళ్ళీ ఒకసారి దేవాలయం గురించి వివరించమన్నాడు. టెడ్ వివరించాను. 1567 లో ఇల్లహాబాద్ కాలాపహాడ్ అన్న ముస్లిం నవాబు ఒరిస్సాలో ఎన్నో దేవాలయాలని నాశనం చేస్తూ వచ్చి, బాంబులు పెట్టి ఈ సూర్య దేవాలయం గర్భగుడినీ ఎన్నో అద్భుత శిల్పాలను కూడా ధ్వంసం చేసాడని చెప్పాను టెడ్ నొచ్చుకున్నాడు. ఆ స్త్రీ పురుష మిథునాల కామకళా శిల్పాల్ని ఎంతో మంది టూరిస్టులు చూసారుగానీ,టెడ్ లాగా వాటితో తాదాత్మ్యం చెందినవాళ్లు అరుదు. రథం చక్రం మీది బొమ్మల్ని పరిశీలించాడు టెడ్. నేను చెప్పాను! " చూడండి, ఒక స్త్రీ తన ప్రియుడితో బాటు పక్క మీంచి లేస్తోంది. పిల్లవాడిని సముదాయిస్తోంది. గృహకృత్యాలు నిర్వర్తిస్తోంది. తాను అలంకరించుకుంటోంది. తిరిగి ప్రియుడితో పక్క మీదికి చేరుతోంది. జీవితమంటే అది" నేను చిలిపి కళ్ళతో అతన్ని చూసాను.

టెడ్ అన్నాడు " ప్రియుడు అనకండి. భర్త అనండి. పిల్లవాడున్నాడు కదా... అన్నట్టు ఈ బొమ్మల మొహాలు ఆనందంతో ఎట్లా వెలిగి పోతున్నాయో చూసారా. పురుషులు స్త్రీలను ఎత్తి పట్టుకు నున్నట్టున్న ఈ కామ భంగిమల్లో పురుషావయవాల్లోని బలమూ, సౌందర్యమూ ఎంత గొప్పగా చెక్కారో! మీ హిందువులు సహజంగా సౌందర్య ప్రియులు! అసలు మా అమెరికన్లు సెక్స్‌ని ఒక శారీరక ప్రవృత్తిగానే గుర్తించారు గానీ మీలాగా సౌందర్యతత్త్వ శాస్త్రంగా పరిశీలించలేదు.. అద్భుతం కామార్తా, ప్రపంచంలో మరెక్కడా ఇంత గొప్ప శిల్పాన్ని చూళ్ళేదు నేను!"

కొన్ని వందలమాట్లు చూసాన్నేను పూర్వం ఈరాళ్ళ గుట్టల్ని. నాకందులో ఎప్పుడూ స్వచ్ఛమైన బూతే కనిపించింది. కానీ ఇదేంటో ఈ టెడ్ ఇప్పుడు ఇంకో ఫ్రీక్వెన్సీలో మాట్లాడుతున్నాడు. ఏమయితేనేం టెడ్ డబ్బూ స్టేటసూ ఉన్న అమెరికన్ యువకుడు ఇతన్ని లోబరుచుకోగలిగానంటే... ఓహ్!

అతనా శిల్పాన్ని ఫొటోలు తీస్తున్నప్పుడు నేను కావాలని నా ఒళ్ళు అతనికి తగిలించాను శిథిలమయిపోయిన గర్భ గుళ్ళోకి పైనుంచి దూకుతున్నప్పుడు పడిపోయినట్టు నటించి అతన్ని

కావిలించుకోబోయాను. ఢిల్లీకి తరలించబడ్డ ప్రధాన సూర్య విగ్రహం తాలూకు దిమ్మమీదికి ఎక్కుతూ అతని వీపుకి నా రొమ్ముల్ని అదిమాను. ప్రతీసారి అతను తనకేం తెలీనట్టుగా చమత్కారంగా తప్పించుకొన్నాడు. ఈ ప్రయత్నాల్లో కాకలో కరిగి కరిగి కాగి పోయింది నేను! అతను మాత్రం ఆ తర్వాత నిశ్చింతగా బొమ్మలు గీసుకున్నాడు. సాయంత్రం టాక్సీలో అతను నాకు ఎడమొహం పెడమొహంగానే కూర్చున్నాడు.

టాక్సీ దిగుతూనే టెడ్ ని డిన్నర్‌కి నా రూమ్‌లోకి ఆహ్వానించాను. మేం భోజనం చేస్తున్నంతసేపూ నేను అతని సౌందర్య పిపాసను పొగుడుతూనే వున్నాను. కళ్ళతో కవ్విస్తూనే వున్నాను. భోజనం అవ్వగానే అతను లేచి వెళ్లిపోబోయాడు. " ఆగండి నా ఆతిథ్యం ఇంకా ఉంది" అన్నాను. షీవాస్ రీగల్ తీసి అతనికీ నాకూ గ్లాసుల్లో పోసి ఐస్ క్యూబ్స్ వేసాను. చీర్స్ చెప్పాను. అతను ఇబ్బందిగా మొహం పెట్టాడు. నాతోబాటే పుచ్చుకున్నాడు. అయిపోగానే చటుక్కున లేచి వెళ్ళిపోయాడు.

నా మొహాన పేడనీళ్లు చల్లినట్లు అయింది. అసలు నామీదికి ఎగబడే టూరిస్టుల్ని దూరంగా ఉంచటమే నాకొక్కొక్కప్పుడు సమస్యవుతుండే. ఇతగాడేమైనా ఋష్యశృంగుడా?... పిట్టగోడ దగ్గరకెళ్లి నుంచున్నాను వెన్నెల .. వెన్నెల.. వెన్నెల. నేతకోసం కొన్ని లక్షల జలతారు పోగులు వరసగా అమర్చ బడినట్టూ గాలికి అవి మిలమిలా మెరిసిపోతున్నట్టూ సముద్రం అలలు! మహోదధి నివాస్ లాడ్జిలో టేపు నుంచి కాబోలు హిందీ మూవీలో సెన్సేషనల్ సాంగ్ 'మనీమనీమనీ' వినిపిస్తోంది.

హాంకాంగ్ ఫిల్మ్ 'ది రెయినింగ్ ఇన్ ది మౌన్‌టెన్' ఎక్సలెంట్ పిక్చర్! హీరోయిన్ బ్రాహుక్ పెట్టుకుంటూంటే చూసి వ్యాపారి ఆమె ఒంటిమీద చెయ్యి వెయ్యబోతాడు. ఆమె " మఠంలోంచి త్రిపిటకాల్ని దొంగిలించి తెచ్చి నీకివ్వటం వరకే మన కాంట్రాక్టు నీకు వేడెక్కగానే నాకు వేడెక్కిందనుకోవడం పొరబాటు" అని హెచ్చరిస్తుంది. బ్యూటిఫుల్ డైలాగ్ కదూ! హఠాత్తుగా చూపులుకలవగానే ఆ ఆడది ఇహ తమను గురించే ఆలోచిస్తూంటుందనుకుంటారు మలప సన్నాసులు! అట్టాంటప్పుడు ఆడదే గనక తలచుకొందా మగాడి పనికాదా గోవిందా? అన్నట్లు టెడ్ ఏం చేస్తున్నాడో ... కిక్ ఎక్కుతోంది... అబ్బ ఏం ఒళ్ళు విరుపులమ్మా! నెలయిందనుకుంటాను మగ స్పర్శతగిలి. టెడ్‌ని లైన్లోకి దింపగలిగితే బావుణ్ణు! ఆ కండలూ ఆ తొడలూ ఆ బలమూ.. అదుగో అప్పుడే చెవుల వెనకాల చెమ్మ ఊరుతోంది. ఇతనితో అసలు రెస్పాన్సే జీరోగా ఉందే! ఆగాగు, ఎక్కడికిపోతాడు హాఁహాఁహాఁ

టక్కున లోపల కొచ్చాను. పల్చటి స్లీవ్‌లెస్ బ్లౌజు తొడుక్కున్నాను లంగా లేకుండా పాంటీమీదే అమెరికన్ జార్జెట్ చీర కట్టాను. చానెల్ ఫైవ్ స్ప్రే చేసుకున్నాను. పైమీదికి షాల్ కప్పుకుని టెడ్ రూమ్ కెళ్ళాను. గుమ్మం అనుకుని నుంచున్నాను. డైరీ రాసుకుంటున్న వాడల్లా తలెత్తి చూశాడు టెడ్ తెచ్చి పెట్టుకున్న నవ్వుతో "ఎహ్...లోపలికి రండి!" అన్నాడు. మౌనంగా లోపలికి నడిచాను. టేబుల్ మీదున్న మార్ల్‌బరో ప్యాకెట్టు అందుకున్నాను గాస్ లైటర్తో సిగరెట్ అంటించుకున్నాను. టెడ్ కెదురుగా టేబుల్ కానుకుని నుంచున్నాను. గాల్లోకి పఫ్‌మని పొగవదిలాను. నా షాల్ జారిపోయింది. టెడ్ ఆశ్చర్యంగా చూశాడు. అతని మొహంలో కంగారు కనిపించింది. " యూ ఆర్ రైడింగ్ మామ్... ప్లీజ్ హావ్ రెస్ట్" అన్నాడు. నేను " నో మనీ డీల్! వోన్లీ టు గ్రాటిఫై యూ!" అన్నాను. " నోనీడ్ మామ్" టెడ్ లేచి నన్ను ఇంచుమించు బయటికి గెంటేసాడు మృదువుగా!

నా వెనకాల " మీరు ఇండియన్స్! తప్పు చేసినా దిద్దుకోగల మనస్థత్వం మీది" అనటం వినిపించింది. భువనేశ్వర్‌లో కూడా పనయింతర్వాత పట్టుబట్టి నాచేత అనకాపల్లికి టికెట్స్ తీయించాడు టెడ్. ఇండియన్ విలేజ్ లైఫ్ చూడాలనుందిట.

★ ★ ★

మేమిద్దరం నా డాబాలోకి అడుగు పెట్టేటప్పటికి.

'అదిగో అల్లదిగో శ్రీ హరివాసమూ పదివేల శేషుల పడగల మయమూ' కీర్తన వినిపిస్తోంది టెడ్ చటుక్కున నా డాబా గది గుమ్మంలోంచి పెంకుటింటి లోకి చూశాడు తెల్లారగట్లే సంగీత సాధన చేస్తున్న నా పదహారేళ్ళ చెల్లి చటుక్కున లేచి లోపలికెళ్ళిపోయింది నాకందుకే ఒళ్ళు మండుతుంది దాన్ని చూస్తే దాని పెళ్ళికి నాడబ్బు కావాలిగాని, నా పొడ మాత్రం ఎవ్వరికీ గిట్టదు హుఁ!

టెడ్‌కి స్నానానికీ లెట్రిన్‌కీ తూర్పువైపు బయటి దొడ్లో ఏర్పాటు చేయించాను పనిమనిషిచేత. గంట గడిచాక దొడ్లోకెళ్ళి చూద్దునుగదా, అక్కడి దృశ్యం ఇది; తులసికోట దగ్గర మా నాన్నా చెల్లాయీ పీటలమీద కూర్చొనున్నారు మా నాన్న లలితా సహస్రం రాగయుక్తంగా చెల్లికి సంత చెబుతున్నాడు మధ్య మధ్య కొంత భాగం తను పఠించి వినిపిస్తున్నాడు టెడ్ దూరంగా చేతులు కట్టుకొని నుంచొని చూస్తున్నాడు. నన్ను చూసి వెలుగుతున్న మొహంతో టెడ్, " ఎంత మాధుర్యంగా పాడుతున్నారు మీ నాన్నగారు!" అన్నాడు. అప్పుడే పనిమనిషి బంగాళా దుంపలూ, టొమాటోలూ తెచ్చి అక్కడ పెడుతోంది. టెడ్ అడిగాడు " మీరు శాఖాహారులా?"

" కాదు, సహజంగా మాంసాహారులం కాని మావాళ్ళంతా శాకాహారం పాటిస్తున్నారు. .. భోజనంలోకి మీకేం కావాలి? కోడా, చేపా?"

" మీ యిష్టం!" నేను వంట చేస్తూంటే నా పిల్లలొచ్చారు. గుమ్మంలోనుంచొని కాస్సేపు చూసి వెళ్ళి పోయారు. టెడ్ అడిగాడు " మీ పిల్లలు మీ దగ్గరికి రారేం?"

" తండ్రీ తాతా చెప్పినట్టు వింటారు వీళ్ళు వీళ్లని నాదగ్గరకి రానియ్యరు వాళ్ళు వీళ్ల అంతకన్నా రోగ్స్'

"కాదు. మీరే వీళ్ళని దగ్గరికి తీసుకోరేమో!".." అవును. ఎందుకు తీసుకోవాలి? వీళ్ళల్లో ఆ రీడర్ రక్తం ప్రవహిస్తోంది. ఆరీడర్ నూతిలో కప్ప! నేను నాయిష్టం వచ్చినట్టు డ్రెస్ చేసుకోకూడదట! అతని ఫ్రెండ్సుకు హాండ్ షేక్ ఇవ్వగూడదట! సొసైటీ లేడీస్‌తో తిరక్కూడదట! పెళ్లాం సరదాలు తీర్చలేనివాడికి బుర్రలో ఎంతుంటే ఎవడిక్కావాలి? ఐ హేట్ హిమ్ లాక్ స్టాక్ అండ్ బారెల్! అందుకే ఛీ పొమ్మన్నాను. ఐ బానిష్డ్ హిమ్!"

కాస్సేపయాక టెడ్ నా వంటగదిలోంచి పెంకుటింటి వంట గదిలోకి తన్మయత్వంతో చూస్తున్నాడు. మా అమ్మా నాపిల్లలకి, దగ్గర కూర్చుని అన్నం కలిపి నోట్లో పెడుతోంది. వాళ్ళు కేరింతలు కొడుతూ తింటున్నారు. నాచెల్లీ నాన్నా ఏవిటేవిటో చెప్పుకుని పకపకా నవ్వుతున్నారు వెధవ గోల ఛీ! ఛీ!

ముందరవైపు గదిలో మధ్యాహ్నపు కునుకుతీస్తున్న నాకు ఎందుకో మెలకువ వచ్చింది. చూద్దునుగదా మధ్య గదిలోంచి టెడ్ మళ్లీ పాతింట్లోకి చూస్తున్నాడు. మా అమ్మ మా నాన్నకి కాళ్లు పిసుకుతున్నది మా చెల్లాయి భగవద్గీతకి తిలక్ రాసిన ఇంగ్లీషు వ్యాఖ్యానాన్ని చదివి మా నాన్నకి తెలుగులో చెబుతోంది- నీ ధర్మాన్ని నువ్వాచరించు, పరధర్మం భయావహం సుమా! నీ కర్తవ్యం నువ్వు నిర్వహించి ఫలితం నాకొదిలేయ్- అట్లాగేదో సమ్ ట్రాష్!

టెడ్ గబగబా మెట్లుదిగి మా నాన్న దగ్గరకెళ్లాడు చటుక్కున మా చెల్లిలోపలి కెళ్ళిపోయింది. మా అమ్మ నుంచుంది. మా నాన్న నవ్వుతూ టెడ్‌ని ఆహ్వానించాడు భగభగా భగభగా మండిపోయింది నాగుండె! నాలుగింటికి నేను రెడీ అయి టెడ్‌ను పిలిచి నాకార్లో ఊరి బయటికి తీసి కెళ్ళాను తుళ్ళుతూ చాలా ఆనందంగా ఉన్నాడు టెడ్ మామిడితోటలో చెట్టు కొమ్మమీద కూర్చున్నాం మేమిద్దరం " అమెరికాలో లేనివి ఇక్కడేమున్నాయని అంత ఆనందపడుతున్నారు?" అడిగాన్నేను

అతనన్నాడు " ఎన్నో ఉన్నాయి. ఈ రంగుల సీతాకోకచిలకల్ని మేం చూడం. పక్షులు మాకొక వింత! ఇంత బాగా రెట్టించి కూసే పక్షిని- కకూ కాబోలు నేనిదే చూట్టం ! అసలు... ప్రకృతితో మేం సహజీవనం చెయ్యం కామార్తా! ప్రకృతిని మేము అడవుల్లోకి తరిమేశాం. మీ నాన్నగారి కాళ్లు మీ అమ్మగారు ఒత్తారు. మీ అమ్మగారు నిద్రపోతే మీ నాన్నగారు విసుర్తున్నారు. దీన్నే కాబోలు ప్రేమంటారు. ఇదేంటో మాకు తెలీదు. భార్యఒక ఖాళీ బాటిల్. భర్త ఒకసిగరెట్ బట్! డూయూనో కామార్తా నేను అనాథగా పెరిగాను. తన పాశవిక సెక్స్ క్రీడలకి ఇష్టపడటం లేదని నా ఏడో ఏట నా తల్లిని నా తండ్రి వదిలేసాడు. అషాక్ భరించలేక నాతల్లి తాగుడుకు అలవాటు పడింది. సిర్రోసిస్‌తో తీసుకుని తీసుకుని గోల్డెన్ గేట్ బ్రిడ్జిమీంచి సముద్రంలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. నేను వెతగ్గా వెతగ్గా నా పదిహేడో ఏట ఓ దుర్ముహూర్తంలో నా తండ్రి కనిపించాడు. తన నాలుగో భార్యతో మాన్‌టెరీ బే బీచ్‌లో తాగి పడుంటే అతని మూడో భార్యొచ్చి నేను చూస్తూండగానే అతన్ని కాల్చి చంపేసింది. ఆమెకు నా తండ్రి అయిదో భర్త"

టెడ్ గొంతులో ఆవేదన హెచ్చింది. " తల్లి తండ్రుల ప్రేమంటే ఏమిటో నాకు తెలీదు. నేను ఎవర్నయినా పెళ్ళి చేసుకుంటే ఆ అమ్మాయి చిరకాలం నాతోటే ఉంటుందనే నమ్మకంలేదు. నా తల్లిదండ్రులు దిక్కులేని చావు చచ్చారు. నేనూ అంతేగా కామార్తా? నేను చచ్చిపోతే నన్నెవరు సమాధి చేస్తారు కామార్తా? నాగురించి ప్రభువుకు ప్రార్థన ఎవరు చెబుతారు కామార్తా? నేనసలు ఎవరికోసం జీవించాలి కామార్తా?

" మా దేశంలో సౌఖ్యం ఉంది. శాంతి లేదు. ఉక్కుకండలున్నాయి, గుండెలేదు! సంసారాలున్నాయి పరస్పర త్యాగాల్లేవు. పిల్లలున్నారు ఆపేక్షల్లేవు. విజ్ఞానం వుంది జ్ఞానంలేదు. అన్నీ ఉన్నాయి ఏమీలేవు! మోతాదుమించిన సెక్స్‌వల్ల మాకు మాశరీరాలమీదే రోత పుడుతోంది. మాదేశం ఒక రోల్లుగోల్డు వల!

" మీకు మీకు... అన్ని వున్నాయి కామార్తా. ఆలుమగల ఆపేక్షలున్నాయి. వృద్ధాప్యంలో సంతానం కనిపెట్టి చూసే సెల్ఫ్ ఇన్స్యూర్డ్ సొసైటీ మీది. దానికి పునాది మీ చెక్కుచెదరని వ్యవస్థ. మీరు భారతీయులు. మీరు అదృష్టవంతులు. నేను... నేను దురదృష్టవంతుణ్ణి దౌర్భాగ్యుణ్ణి! కన్‌డెమ్డ్ అండ్ కన్‌సైన్డ్ టు హెల్" రుమాలు అడ్డు పెట్టుకుని టెడ్ సన్నగా ఏడవసాగాడు. నాకు మతిపోయింది అతని మాటల్లో ఏదో పాయింటున్నట్టు అనిపించినా మరుక్షణంలో నాకు చిరాకేసింది. అతన్ని సముదాయించి ఇంటికి తీసుకొచ్చాను. ఆ రాత్రి డిన్నర్ అయాక షీవాస్‌రీగల్ బయటికి తియ్యబుద్ది కాలేదు. నాకు దిక్కు మాలిన టెడ్ ఏడుపు మూలంగా అసలా ధ్యాసే చచ్చింది. పెగ్ పడందే భోజనం బల్లముందు నుంచి లేవని టెడ్ కూడా ఆ వాసనే చూల్లేదు. బహుశా మానాన్న ప్రభావం అయ్యుండచ్చు ఏ సంకోచమూ లేకుండా మానాన్న దగ్గరకెళ్ళి ఆయన మంచంమీద కూర్చున్నాడు. వచ్చీరాని ఇంగ్లీషులో మా నాన్నేదో మాట్లాడుతున్నాడు.

నా అశా సౌధాలు ఒకటొక్కటిగా కూలిపోతున్నాయి. నాగుప్త సామ్రాజ్యం పతనమై పోతోంది ఆలోచించగా ఆలోచించగా ఈ అనాథ సన్నాసికి సంపాదించుకున్న సొమ్మేకాని సంపద సొమ్ము లేదని కూడా తెలిసిపోయింది. టెడ్ మీద కసొచ్చేసింది. వీడు అమెరికాలో చెడ బుట్టిన పిచ్చాడు! ఏబ్రాసీ! బ్రాజమానం! బూడిద రాలే జోగినాథం! వీణ్ణొదిలించుకోటమంత ఉత్తమం ఇంకోటి లేదు అనిపించింది.

అర్ధరాత్రివేళ టెడ్ నాగుమ్మం తలుపు కొట్టాడు. వెళ్ళి తలుపు తీసాను. నవ్వుతూ అన్నాడు టెడ్ " ఎక్స్క్యూజ్‌మి..మీ రెస్ట్ రూం ఎక్కడ?" నాకు మొదట్లో అర్థం కాలేదు. అర్థమయ్యాక

గుండె వేగం చటుక్కున హెచ్చింది  అతనికి ఆడదాని అవసరం ఇప్పుడొచ్చిందన్నమాట! ఇంత మంచి వాడ్ని అవమానించాను  పాపిష్టిదాన్ని! అనిపించింది అతని వైపు ఓరగా చూసాను.

అతను, '' ఈ సమయంలో మీకిబ్బంది కలిగిస్తున్నానేమో'' అన్నాడు

సరసానికి ఇబ్బందేమిటి? సన్నాసి కాకపోతే? నవ్వుకుంటూ నేను అతని చెయ్యి ముద్దు పెట్టుకుని నా దక్షిణం వైపు బెడ్‌రూం తాళం తీసి అతన్ని లోపలికి తీసికెళ్లాను  నాడబుల్ బెడ్ చూపిస్తూ

'' ఇదే నాబెడ్ రూం'' అన్నాను. అతను కంగారుపడ్డాడు '' అహాఁ ఇదికాదు రెస్ట్‌రూమ్ . . అంటే  . అంటే లెట్రిన్''

నేను చటుక్కున అతని చెయ్యి వదిలేసాను  ఆ పక్కనే ఉన్న లెట్రిన్ చూపించాను  అతను వెళ్ళాడు అతనిమీద స్ప్రింగ్‌లాగా తన్నుకొచ్చిన నా కసి అంతా ఇంతా కాదు! వీడు వీడు... ఫూల్ ఆఫ్ యాస్ యాస్! రోగ్ ఆఫ్ ఫస్ట్ వాటర్స్! స్కాండ్రల్ ఆఫ్ ఇమ్యూనిటీ! ఫిల్దీ బాస్టర్డ్! రోవింగ్ ట్రంపెట్! .... అట్లా ఎంతసేపు తిట్టుకున్నానో నాకే తెలీదు అతను వెళ్లిపోయింది అంతకన్నా గమనించలేదు

తెల్లారింది  టెడ్‌ను తక్షణం బయల్దేరమన్నాను. చస్తే రానన్నాడు. మూడు రోజులకీ నా ఫీజు మూడువేలూ నాచేతిలో పెట్టాడు. కంపెనీ ఎమ్ డి కిమ్మనమని ఒక కవరూ, తన గ్రూప్ లీడర్ కిమ్మనమని ఇంకో కవరూ ఇచ్చాడు. నా కొళ్లు ఎంతమండిందంటే నా ప్రయాణంలో యారాడ కొండదగ్గర నాకారు ఆగిపోయేటంతగా కార్పోరేటరు మండినంత!

వారం తర్వాత టెడ్ నించి నాకుత్తరం వచ్చింది. '' డియర్ కామార్తా! ఇక అసలైన ఇండియన్ లేడీని వివాహం చేసుకోవాలనుకున్నాను. వివాహం తర్వాత ఆమెతో అమెరికాలో ఒక ఏడాది గడిపి ఒక్‌లాండ్‌లో ఉన్న ఆస్తులన్నీ అమ్మి ఆ డబ్బుతో ఇక్కడికొచ్చి స్థిరపడిపోదామనుకున్నాను. హిందువుగా ప్రశాంతంగా జీవిద్దామనుకున్నాను. నా ఈ ప్రతిపాదన లన్నింటిని సహృదయంతో మీ నాన్నగారు అర్థం చేసుకున్నారు. ఆశీర్వదించారు. అన్నట్టు నా తల్లి ఒక కాలిఫోర్నియా జమిందారిణి తాలూకు నీతిగల కూతురు. నీ చెల్లెలు వంటి ఉత్తమురాలు తన కోడలవటం చూసి ఆమె ఆత్మ శాంతిస్తుందనుకుంటున్నాను. విష్ మి బెస్టాఫ్‌లక్ - టెడ్!!!

(ఆంధ్రభూమి మంత్లీ, డిసెంబర్ '83)

★ ★ ★     ★ ★ ★     ★ ★ ★